క్లుప్తంగా

'కౌశిక్‌రెడ్డిపై కేసు పెట్టడం సరికాదు'


మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: కౌశిక్ రెడ్డిపై పెట్టిన అక్రమ కేసును తీవ్రంగా ఖండిస్తున్నామని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో గిరిజనులపై రేవంత్ రెడ్డి చిన్నచూపుగా మాట్లాడారని, ముందుగా రేవంత్ రెడ్డిపైనే అట్రాసిటీ కేసు నమోదు చేయాలన్నారు. రాములు నాయక్ కోడలికి మార్కులు ఎలా వచ్చాయని ప్రశ్నించడం తప్పా అన్నారు.

ఇచ్చోడ అగ్నిమాపక శాఖ అధికారిగా ఎండీ షఫీ


ఎండీ షఫీ

ఇచ్చోడ: ఇచ్చోడ అగ్నిమాపక శాఖ అధికారిగా ఎండీ షఫీ నియమితులయ్యారు. గత కొన్ని రోజుల నుంచి ఇచ్చోడ అగ్నిమాపక అధికారిగా సీనియర్ ఫైర్‌మెన్ కొనసాగుతూ వచ్చారు. ఎట్టకేలకు ప్రభుత్వం నిజామాబాద్ అగ్నిమాపక శాఖ అధికారిగా పనిచేస్తున్న షఫీని ఇక్కడికి బదిలీ చేసింది. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించారు.

టీబీ నిర్మూలనకు కృషి చేయాలి


పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: టీబీ నిర్మూలనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని హెచ్‌ఈఓ పవార్ రవీందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో టీబీ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ టీబీని అంతమొందించేందుకు అందరూ కృషి చేయాలన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి పరామర్శ


రవిని పరామర్శిస్తున్న జైవంత్‌రావు

ఉట్నూర్‌రూరల్: మండల కేంద్రానికి చెందిన జర్నలిస్టు రవి గురువారం మండల కేంద్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలయ్యాడు. ప్రస్తుతం కరీంనగర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా మాజీ ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు శుక్రవారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు.

ట్రెజరీ ఉద్యోగుల ఔదార్యం


నగదు అందజేస్తున్న సంఘ నాయకులు

కైలాస్‌నగర్: జిల్లా ట్రెజరీ శాఖ ఉద్యోగులు ఔదార్యాన్ని చాటుకున్నారు. ఆ శాఖలో డాటా ఎంట్రీ ఆపరేటర్‌గా పనిచేసే ఔట్ సోర్సింగ్ ఉద్యోగి రామ్మోహన్ (రాజు) అనారోగ్యంతో మృతి చెందగా బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. రామ్మోహన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉండగా వారికి విరాళంగా సేకరించిన రూ.1,00,700 అందజేశారు. శుక్రవారం పట్టణంలోని రాజు నివాసానికి వెళ్లి మృతుడి భార్యకు ఆర్థికసాయం చేశారు. ట్రెజరీ శాఖ రిటైర్డు డిప్యూటీ డైరెక్టర్ అనంత్‌రావు, మాజీ జెడ్పీటీసీ గణేశ్ రెడ్డి, ఉమ్మడి జిల్లా ట్రెజరీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు చంద్రమోహన్ రెడ్డి, ఎస్టీవోలు రమణచారి, గంగాధర్, సతీశ్ సింగ్, విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ


బాధ్యతలు తీసుకుంటున్న పూజ

జైనథ్: మండల నూతన వ్యవసాయ విస్తరణ అధికారిగా పూజ శుక్రవారం బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మండల పరిధిలో ఉన్న రైతుల సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.

నకిలీ విత్తు.. రైతు చిత్తు

- నకిలీ విత్తనాలతో ఏటా మోసపోతున్న రైతులు
- అమాయక గిరిజన రైతులే లక్ష్యంగా దందా
- విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు తప్పనిసరి


నకిలీ విత్తనాలపై వ్యాపారస్తులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారులు

సిరికొండ: వచ్చేది వానాకాలం ఈ కాలం రైతన్నలు వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉంటారు. పొలం దుక్కులు దున్ని ఏ పంటలు వేయాలో అన్న సమాలోచనలో ఉంటారు. ఈ సమయంలోనే రైతులను మోసం చేస్తూ కొందరు అక్రమార్కులు రైతులకు నకిలీ విత్తనాలను అంటగడుతారు. విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

గిరిజన రైతులే టార్గెట్..

మండలంలోని గిరిజన రైతులను లక్ష్యంగా చేసుకుని అక్రమార్కులు నకిలీ దందాకు పాల్పడుతున్నారు. గిరిజన రైతుల్లో ఎక్కువ మంది నిరక్షరాస్యులు కావడం, మారుమూల ప్రాంతంలో ఉండటం, ఆర్థికంగా వెనుకబాటుతనంలో ఉండడంతో సులువుగా వారిని మోసం చేస్తూ నకిలీ విత్తనాలను విక్రయిస్తున్నారు. గతంలో నకిలీ విత్తనాలు సాగు చేసి మోసపోయిన రైతులూ ఉన్నారు. మండలంలోని గిరిజన రైతులు నకిలీ వ్యాపారుల వద్ద కాకుండా వ్యవసాయ శాఖ ద్వారా లైసెన్స్ పొందిన దుకాణాల్లో మాత్రమే విత్తనాలు కొనుగోలు చేయాలని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. కొనుగోలు చేసిన విత్తనాలకు రశీదులు పొందాలని, వాటిని పంట చేతికొచ్చేవరకు కూడా భద్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు.

జాగ్రత్తలే మేలు..

మండలంలో ఎలాంటి ప్రాజెక్టులు లేకపోవడంతో అన్నదాతలు వర్షధారంపై ఆధారపడి పంటలు సాగు చేస్తుంటారు. వానలు పడితేనే విత్తనాలు విత్తుకుంటారు. దీంతో రైతులకు నకిలీ విత్తనాలు కట్టబెడితే వేసిన విత్తనాలు ఒక్కసారికి మొలకెత్తకపోతే ఆర్థికంగానూ, సమయంపరంగానూ రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. రైతులు విత్తనాలు కొనుగోలు సమయంలో జాగ్రత్తలు పాటించాలని వ్యవసాయాధికారులు కోరుతున్నారు.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- విత్తనాలను లైసెన్స్ ఉన్న వ్యాపార దుకాణంలోనే కొనుగోలు చేయాలి.
- విత్తనాలు కొనుగోలు చేసే ముందు లేబుల్ చూసి, విత్తన ప్యాకెట్లను జాగ్రత్తగా పరిశీలించాలి.
- విత్తన ప్యాకెట్ ధ్రువీకరణ నంబర్, తేదీ, విత్తన రకం వంటి వివరాలు చూసుకోవాలి.
- విత్తనాల కొనుగోలుకు సంబంధించిన రశీదు తప్పక తీసుకోవాలి.
- విత్తనాలు కొనుగోలు చేసే ముందు ధరను చూడాలి.
- నకిలీ వ్యాపారుస్తుల వద్ద విత్తనాలను కొనుగోలు చేయకూడదు.
- రైతులకు ఎలాంటి అనుమానాలు ఉన్నా వెంటనే వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించాలి.

అవగాహన కల్పిస్తున్నాం..

మండలంలో నకిలీ విత్తనాలపై రైతులకు, వ్యాపారస్తులకు అవగాహన కల్పిస్తున్నాం. విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తాం. నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటాం. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే ముందు వ్యవసాయ శాఖ అధికారులను సంప్రదించి సూచనలు, సలహాలు తీసుకోవాలి. నకిలీ విత్తనాలు అమ్మితే వ్యాపార లైసెన్స్ రద్దు చేస్తాం. – శ్రద్ధారాణి, మండల వ్యవసాయాధికారి

చర్యలు తీసుకుంటాం..



రైతులను మోసం చేసి నకిలీ విత్తనాలు అమ్మినా, సరఫరా చేసినా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. నకిలీ విత్తనాలు అమ్మడం నేరం. విత్తన దుకాణాల్లో తనిఖీలు నిర్వహిస్తాం. వ్యాపారస్తులు తమ దుకాణాల ఎదుట తహసీల్దార్, వ్యవసాయాధికారి, ఎస్సై మొబైల్ నంబర్లతో కూడిన బోర్డు పెట్టాలి. ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్ముతున్నట్లు తెలిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలి.– శ్రీసాయి, ఎస్సై

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు


మాట్లాడుతున్న ఏవో శ్రీనివాసరెడ్డి

భీంపూర్: నకిలీ విత్తనాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని ఏవో శ్రీనివాసరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని రైతు వేదికలో టాస్క్‌ఫోర్స్ టీం ఆధ్వర్యంలో పెస్టిసైడ్స్ యజమానులతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లూజు సంచులలో ఉన్న విత్తనాలను రైతులకు అమ్మవద్దన్నారు. గుర్తింపు పొందిన విత్తన కేంద్రాల వద్ద విత్తనాలు కొనుగోలు చేసి రశీదును రైతులకు అందజేయాలని సూచించారు. తహసీల్దార్ నలందప్రియ, ఎస్సై పీర్‌సింగ్, ఏఈవోలు తదితరులు ఉన్నారు.

మార్కెట్‌యార్డులో రక్షణ కల్పించాలి


వ్యవసాయాధికారులతో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: ఆదిలాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డులో రక్షణ కల్పించాలని రైతు సంఘం నాయకులు బండి దత్తాత్రి, కొండ రమేశ్ అన్నారు. ఇటీవల రైతులపై రాళ్లతో దాడి చేసిన నేపథ్యంలో శుక్రవారం మార్కెట్ యార్డును సందర్శించారు. వారు మాట్లాడుతూ మార్కెట్ యార్డులో రైతులకు రక్షణ లేకుండా పోయిందన్నారు. కష్టపడి పండించిన పంటను విక్రయించేందుకు మార్కెట్‌కు తీసుకొస్తే దొంగలు దోచుకెళ్తున్నారని వాపోయారు. దొంగతనం చేయకుండా చూసిన ఇద్దరు రైతులపై రాళ్లతో దాడి చేశారన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా మార్కెట్ అధికారులు చూడాలని కోరారు. మే నెల చివరి వరకు జొన్న పంటను కొనుగోలు చేయాలని మార్కెట్ అధికారిని కోరారు.

సర్కారు బడుల్లో పిల్లలను చేర్పించండి


బడిబాట నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

ఆదిలాబాద్‌టౌన్: సర్కారు బడుల్లో పిల్లలను చేర్పించాలని ఎంఈవో సోమయ్య అన్నారు. శుక్రవారం పట్టణంలోని కేఆర్‌కే కాలనీలో యూపీఎస్ తెలుగు మీడియం ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం కాలనీలో ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులతో పాటు అన్ని సౌకర్యాలు ఉన్నాయన్నారు. ఇంటింటికి తిరుగుతూ అవగాహన కల్పించారు. ప్రధానోపాధ్యాయుడు షేక్ అలీ, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్ రజియా సుల్తాన, ఉపాధ్యాయులు నవీన్ యాదవ్, శృతి, శ్రావణి, అంగన్‌వాడీ కార్యకర్త పాల్గొన్నారు.

ఉరుములు, మెరుపులు.. వర్షం

కైలాస్‌నగర్: జిల్లాలో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడింది. శుక్రవారం మధ్యాహ్నం వరకు ఎండ దంచికొట్టగా సాయంత్రం ఒక్కసారిగా వర్షం పడడంతో వాతావరణం చల్లబడింది. ఈదురుగాలులతో కూడిన భారీ వర్షంతో పలు చోట్ల చెట్లు విరిగిపడ్డాయి. కొన్ని చోట్ల ఇళ్ల పైకప్పులు ఎగిరిపడ్డాయి. పలు చోట్ల విద్యుత్ సరఫరాలో తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఫలితంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంతో పాటు గుడిహత్నూర్, ఇంద్రవెల్లి, జైనథ్, భీంపూర్, తాంసి, తలమడుగు తదితర మండలాల్లో మోస్తారు నుంచి భారీ వర్షం కురిసింది. అకాల వర్షం జిల్లాలోని రైతాంగానికి తీవ్ర నష్టాన్ని మిగిల్చింది.

ఇంద్రవెల్లి: మండలకేంద్రంతో పాటు మండలంలోని ముత్నూర్, హీరాపూర్, కేస్లాపూర్, కేస్లాగూడ, ఏమాయికుంట, ఈశ్వర్‌నగర్, వాగాయితండా తదితర గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఈదురుగాలులతో భారీ వర్షం కురిసింది. దీంతో మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. మండలకేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో అమ్మకానికి తీసుకొచ్చిన జొన్న పంట వర్షానికి తడిసిపోందని రైతులు వాపోయారు.

తాంసిలో..

తాంసి: మండలంలో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. మండల కేంద్రంతో పాటు జామిడి, కప్పర్ల, హస్నాపూర్, వడ్డాడి, పాలోడి, గిరిగాం తదితర గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. తాంసి గ్రామానికి సమీపంలో సాయినగర్ కాలనీలోని పంటచేనులో ఉన్న తాటిచెట్టుపై పిడుగు పడింది. పిడుగుపాటుకు చెట్టుపై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. మార్కెట్‌యార్డుకు తీసుకొచ్చిన జొన్నలు సైతం వర్షానికి తడిసిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

పరిసరాల పరిశుభ్రతతో వ్యాధులు దూరం


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

నేరడిగొండ: వ్యక్తిగత శుభ్రతతో పాటు ప్రతిఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని నేరడిగొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సద్దాం అన్నారు. జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వారానికోసారి డ్రైడేగా పాటించాలన్నారు. వైద్య సిబ్బంది హెచ్‌ఈవో పవార్ రవీందర్, హెల్త్ సూపర్‌వైజర్ సంతోష్, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంగీ వ్యాధిపై అవగాహన ఉండాలి

ఇచ్చోడ: డెంగీ వ్యాధిపై ప్రతీ ఒక్కరికి అవగాహన ఉండాలని ఇచ్చోడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు మధురిమ అన్నారు. శుక్రవారం జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బందితో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వానాకాలంలో ఇంటిపరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు ఉండటంతో దోమలు వ్యాప్తి చెంది డెంగీ సోకే ప్రమాదం ఉందన్నారు. హెల్త్‌అసిస్టెంట్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: డెంగీ పట్ల అప్రమత్తంగా ఉండాలని పిట్టబొంగురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాథోడ్ ప్రతాప్ నాయక్ పేర్కొన్నారు. శుక్రవారం పిట్టబొంగురం గ్రామంలో ప్రా థమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో జాతీయ డెంగీ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. గ్రామ పటేల్ భీంరావ్, హెల్త్ హెచ్‌ఈవో రాథోడ్ గోకుల్, హెల్త్ సూపర్‌వైజర్ జలేందర్, విజయ్, ప్రియాంక, మాధవి తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకం తగ్గించాలి


బజార్‌హత్నూర్: అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్త

సిరికొండ: వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వాడకం తగ్గించి సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని వ్యవసాయ శాస్త్రవేత్త అసోసియేట్ ప్రొఫెసర్ అనిత రైతులకు సూచించారు. మండలంలోని రాయిగూడలో శుక్రవారం నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో మాట్లాడారు. వ్యవసాయంలో గడ్డి మందుల వాడకం తగ్గించాలని, పంట మార్పిడి పద్ధతులు పాటించాలన్నారు. పొలం గట్లపై చెట్లను పెంచి పర్యావరణాన్ని కాపాడాలన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు, మండల వ్యవసాయాధికారి శ్రద్ధారాణి, వ్యవసాయ విస్తరణ అధికారి ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

జాతర్లలో రైతులకు అవగాహన సదస్సు

బజార్‌హత్నూర్: 'రైతు ముంగిట శాస్త్రవేత్తలు' కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలోని జాతర్ల గ్రామంలో రైతు సదస్సు ఏర్పాటు చేశారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ఎలాంటి విత్తనాలు కొనుగోలు చేయాలి, భూమి రకాలు, వ్యవసాయ పద్ధతులు, తదితర అంశాలపై వివరించారు. దీంతోపాటు రైతుల సందేహాలను నివృత్తి చేశారు. శాస్త్రవేత్తలు ఎం.రాజేందర్ రెడ్డి, రఘువీర్, అనిల్ కుమార్, మండల వ్యవసాయ అధికారి మహమ్మద్ సొద్, వ్యవసాయ విస్తరణ అధికారి ఎ.రాజేశ్వర్, నాగోరావ్, ఈశ్వర్, దేవురావ్, బలిరామ్, చందన్, రైతులు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ తొలగించి.. ప్రభుత్వ భూమి స్వాధీనం

ఆదిలాబాద్‌రూరల్: మావల మండలం బట్టిసావర్గాం శివారులోని న్యూ హౌజింగ్ బోర్డుకు అనుకొని ఉన్న సర్వే నంబర్ 72లోని ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్నట్లు తహసీల్దార్ వేణుగోపాల్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కలెక్టర్ రాజర్షి షా ఆదేశాల మేరకు ప్రభుత్వ భూమిలో వేసిన ఫెన్సింగ్‌ను తమ సిబ్బంది పరిశీలించి విచారణ చేపట్టారన్నారు. అజుముల్ ఖాద్రి అనే వ్యక్తి భూమి తనదిగా పేర్కొంటూ ఫెన్సింగ్ వేశారన్నారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను పరిశీలించగా భూమి సర్కారీ పోరంబోకు భూమిగా నమోదై ఉందన్నారు. సర్వే నంబర్ 72 ప్రభుత్వ భూమిలో ప్రవేశించరాదని, ఎలాంటి ఆక్రమణలు చేయరాదని, ఆక్రమణలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఇచ్చోడ: మండలంలోని ఇచ్చోడ, నర్సాపూర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో మరమ్మతుల కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఇన్‌చార్జి ఏఈ రాజు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

మూగజీవాల కోసం తొట్టె ఏర్పాటు


తొట్టెలోని నీరు తాగుతున్న పశువు

నార్నూర్: మూగజీవాల దాహార్తి తీర్చేందుకు మండల కేంద్రానికి చెందిన సహకార సంఘం డైరెక్టర్ దుర్గే కాంతారావు తొట్టె నిర్మించారు. తన సొంత నిధులతో తన ఇంటి ముందు నీటి తొట్టె నిర్మించి నీటి వసతి ఏర్పాటు చేశారు. దీంతో నీటితొట్టెలో నీరు తాగుతూ మూగజీవాలు తమ దాహార్తి తీర్చుకుంటున్నాయి. ఆయనను పలువురు అభినందించారు.

మార్కెట్‌యార్డులో గందరగోళం


రోడ్డుపైనే నిలిచిన వాహనాలు

జైనథ్: మండల కేంద్రంలోని మార్కెట్‌యార్డుకు జొన్న విక్రయానికి రైతులు శుక్రవారం భారీగా తరలివచ్చారు. మార్కెట్‌యార్డులో జొన్న నిల్వలు పేరుకుపోవడంతో జొన్న కొనుగోళ్లలో కొంత జాప్యం జరిగింది. రాత్రి నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు రైతులు వేచి చూడాల్సి వచ్చింది. భారీగా జొన్న లోడ్‌తో వాహనాలు రావడంతో మూడు కిలోమీటర్ల మేర వాహనాలు రోడ్డుపైనే నిలిచిపోయాయి. దీంతో కొంత ట్రాఫిక్ సమస్య ఏర్పడింది. గ్రామాల వారీగా షెడ్యూల్ ఏర్పాటు చేసినా వివిధ గ్రామాలకు చెందిన రైతులు మార్కెట్‌యార్డ్‌కు జొన్న పంట తీసుకురావడంతో మార్కెట్‌యార్డ్ గందరగోళంగా మారింది. మండల వ్యవసాయ శాఖ అధికారి పూజ మాట్లాడుతూ నూతన మండలాలు సాత్నాల, భోరజ్‌లలోనూ జొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఆయా మండలాలకు చెందిన రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

'రైతులను పట్టించుకోని ప్రభుత్వం'


జొన్న పంట పరిశీలిస్తున్న విశారదన్ మహరాజ్

బోథ్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోవడం లేదని ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు, ధర్మసమాజ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ అన్నారు. శుక్రవారం లక్ష కిలోమీటర్ల రథయాత్ర సందర్భంగా మండల కేంద్రంలో రథయాత్ర చేపట్టారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని పరిశీలించారు. రోగులతో మాట్లాడారు. అనంతరం మార్కెట్‌యార్డులో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి రైతులతో మాట్లాడారు. హమాలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. హమాలీలకు లైసెన్సులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మార్కెట్ కార్యదర్శి విఠల్‌తో ఈ విషయమై చర్చించారు. రాష్ట్ర నాయకులు అన్నెల లక్ష్మణ్, జిల్లా నాయకులు వెంకటేశ్, ప్రవీణ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ఉపాధి పనిలో మాజీ ప్రజాప్రతినిధులు

ఇచ్చోడ: మండలంలోని ముఖరా కే గ్రామ మాజీ సర్పంచ్ గాడ్గే మీనాక్షి, మాజీ ఎంపీటీసీ గాడ్గే సుభాశ్‌లు శుక్రవారం గ్రామంలో చేపడుతున్న ఉపాధిహామీ పనులకు వెళ్లారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు రాక మాజీ సర్పంచులు అప్పులు పాలయ్యారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలని డిమాండ్ చేశారు.

'ఎంపీని ఆహ్వానించకపోవడం దారుణం'

ఆదిలాబాద్‌రూరల్: సరస్వతి పుష్కరాల సందర్భంగా స్థానిక ఎంపీ గడ్డం వంశీకృష్ణను ఆహ్వానించకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేశ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లోని మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎంపీని ఆహ్వానించకపోవడం ఇన్‌చార్జి మంత్రి శ్రీధర్‌బాబు అహంకార పూరిత వైఖరికి నిదర్శనమన్నారు. అక్కడున్న ఉద్యోగులు అగ్రవర్ణ కులాలకు చెందిన వారు కావడం వల్లే దళిత ఎంపీని ఆహ్వానించలేదని ఆరోపించారు. ఉద్యోగులను సస్పెండ్ చేయడంతో పాటు మంత్రి శ్రీధర్‌బాబును మంత్రి వర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు మల్లన్న, అసోసియేషన్ అధ్యక్షుడు రాఘవేంద్ర, సంయుక్త కార్యదర్శి రాజేశ్వర్, రఘు, రమేశ్, స్వామి, అశోక్, పొచ్చన్న, లక్ష్మణ్ పాల్గొన్నారు.

30లోగా జొన్నల కొనుగోళ్లు పూర్తి చేస్తాం

సాత్నాల: జొన్నల కొనుగోళ్లను ఈనెల 30లోగా పూర్తి చేస్తామని జైనథ్ పీఏసీఎస్ చైర్మన్ బాలూరి గోవర్ధన్ రెడ్డి అన్నారు. భోరజ్ మండలంలోని పిప్పర్‌వాడలో నూతనంగా ఏర్పాటు చేసిన జొన్నల కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ప్రారంభించారు. నూతన సాత్నాల, భోరజ్ మండలాల్లో మార్కెట్ ఏర్పాటు కోసం మూడెకరాల చొప్పున స్థలాన్ని కేటాయించాలని కలెక్టర్‌ను కోరామన్నారు. సీఈవో గంగన్న, జైనథ్ ఏఎంసీ చైర్మన్ అల్లూరి అశోక్ రెడ్డి, మామిడి మల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

'పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి'

ఆదిలాబాద్‌అర్బన్: విద్యా సంసత్సరం ప్రారంభం కాకముందే ముందస్తు అడ్మిషన్లు నిర్వహిస్తున్న శ్రీచైతన్య, నారాయణ, ఎస్ఆర్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎగ్రాజీ హరీశ్, మడావి గణేశ్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్పొరేట్ విద్యా సంస్థలు నిర్వహిస్తున్న ముందస్తు అడ్మిషన్లు తక్షణమే ఆపాలని, అలాంటి విద్యాసంస్థలపై డీఈవో, ఎంఈవోలు చర్యలు తీసుకోవాలని కోరారు.

పేకాట స్థావరంపై దాడులు

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని బొక్కల్‌గూడ కిరాణాషాప్‌లో పేకాట ఆడుతున్న ముగ్గురు వ్యక్తులను శుక్రవారం అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ సునీల్ కుమార్ తెలిపారు. షేక్ అయాన్, అబ్దుల్ గౌస్, నాహిద్ చౌష్‌లు పేకాట ఆడుతుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ.1800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కోర్టుకు హాజరైన ఆదివాసీలు


కోర్టు వద్ద ఆదివాసీలు

బోథ్: గతంలో ఎస్టీ జాబితా నుంచి లంబాడీలను తొలగించాలని చేపట్టిన ఉద్యమంలో పలువురు ఆదివాసీ నాయకులతో పాటు పలువురిపై కేసులు నమోదు కాగా, శుక్రవారం బోథ్ జూనియర్ సివిల్ కోర్టుకు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ పెట్టిన కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. తుడుందెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గొడం గణేశ్, కొడప నగేశ్, రామెల్లి భోజన్న, పెద్ద భూమన్న, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కుడాల స్వామి తదితరులు పాల్గొన్నారు.